
TGTEL/25/A3750

... నిజమే ...

# నిజాయితీ

https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక

"నిజాయితీ" ఒక ముఖ్యమైన నైతిక లక్షణం ఇది విశ్వసనీయత, విధేయత మరియు సమగ్రతను పెంచుతుంది.



ఎడిటర్ : బొడ్డుపల్లి మల్లయ్య సంపుటి 1 సంచిక 211 నెట్‌వర్క్ ఇంచార్జ్ & మెయింటెనెన్స్ : గుండూర్ శ్యామ్ . సోమవారం 27 జూలై 2026 వెల 4:00

# "జై జవాన్-జై కిసాన్ -జై యువ"

## సిఎం రేవంత్‌రెడ్డి కొత్త నినాదం



**హైదరాబాద్, జులై 26 (నిజాయితీ):**
'జై జవాన్ జై కిసాన్ – జై యువ' అనే నూతన నినాదాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దేశ భవిష్యత్ నిర్మాణంలో యువతను మరింత భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ట వయోపరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించేలా రాజ్యాంగ సవరణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరా రు. హైదరాబాద్‌లో జాతీయ మీడియా ప్రతినిధులతో ఆదివారం జరిగిన సమావేశంలో సిఎం మాట్లాడుతూ.. యువశక్తే దేశ భవిష్యత్‌కు పునాదిగా నిలుస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ రం గాల్లో నాయకత్వ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్న యు వతకు, అదే స్థాయిలో రాజకీయ వ్యవస్థలోనూ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల నిర్వహించిన సీబిఎస్ఈ, నీట్, నెట్ తదితర జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో తలెత్తిన సమస్యలపై సిఎం రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.
యువతకు చట్టసభల్లోనూ తగిన ప్రాతినిథ్యం కల్పించాలి విద్యార్థులు, వారి కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం తగిన చర్య లు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఆందోళనల సందర్భంగా నమోదైన కేసులను సమీక్షించడంతో పాటు నష్టపోయిన కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. నేటి యువత 21 ఏళ్ల వయస్సులోనే ఐఏఎస్, ఐపిఎస్ అధికారులుగా, స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు నిర్వహి స్తున్నారని, ప్రపంచస్థాయి సంస్థలకు నాయకత్వం వహిస్తున్నారని ముఖ్యమంత్రి వెల్లడించారు. సాంకేతిక, పరిపాలనా, వ్యాపార రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్న యువతకు చట్టసభల్లోనూ తగిన ప్రాతినిథ్యం కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించిన విషయాన్ని, 73వ, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ట వయస్సును 21 ఏళ్లకు సవరించిన విషయాన్ని సిఎం ప్రస్తావించారు.

అదే స్ఫూర్తితో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ట వయస్సును 25 నుంచి 21 ఏళ్లకు, శాసనమండలి, రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ట వయస్సును 30 నుంచి 25 ఏళ్లకు తగ్గించాలని సిఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. ఈ అంశంపై సమగ్ర చర్చ నిర్వహించేందుకు ఆగష్టు నెలలో తెలంగాణ శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సిఎం తెలిపారు. అన్ని రాజకీయ పక్షాల అభిప్రాయాలు స్వీకరించిన అనంతరం పోటీ వయోపరిమితి తగ్గింపును కోరుతూ అధికారిక తీర్మానాన్ని ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన, పార్లమెంట్ సీట్ల పెంపు, మహిళా రిజర్వేషన్ వంటి అంశాలతో పాటు ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ట వయోపరిమితి తగ్గింపు అంశాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత పాత్రను మరింత విస్తరించడం దేశ భవిష్యత్‌కు అవసరమని తెలిపారు.

**అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ట వయో పరిమితిని 25 నుండి 21కి తగ్గించాలి**
**యువతకు చట్టసభల్లోనూ తగిన ప్రాతినిధ్యం కల్పించాలి**
**వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో సమగ్ర చర్చ, తీర్మానం చేసి కేంద్రానికి పంపుతాం**
**'నీట్' ఆందోళనలు, నమోదైన కేసులపై కేంద్రం సమీక్షించాలి**
**నష్టపోయిన కుటుంబాలకు సాయం చేయాలి**
**జాతీయ మీడియాతో సిఎం రేవంత్‌రెడ్డి**

# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్..



**ఏఐసీసీ సమావేశంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి హైకమాండ్ పెద్దలతో నామినేటెడ్ పదవుల భర్తీపై చర్చించే అవకాశం మంత్రివర్గ విస్తరణపైనా మంతనాలు?**

**హైదరాబాద్, జులై 26 (నిజాయితీ):**
నామినేటెడ్ పదవుల భర్తీపై ఏఐసిసి అగ్ర నేతలతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం మంతనాలు జరపనున్నారు. ఆయనతో పాటు పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్, ఏఐసిసి నాయకురాలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కూడా ఈ చర్చల్లో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. నిజానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్ ఏఐసిసి సమావేశంలో పాల్గొనేందుకు సోమవారం ఢిల్లీ వెళ్ళనున్నారు. ఇందులో భాగంగానే ఏఐసిసి పెద్దలతో నామినేటెడ్ పదవులపై చర్చించనున్నారు. రెండేళ్ళ క్రితం ముప్పై కార్పొరేషన్లకు చైర్మన్ల పదవులను, వాటికి డైరెక్టర్లను నియమించారు. వీటిలో ఒకటి, రెండు మినహా దాదాపు అన్నింటి పదవీ కాలం పూర్తయ్యింది. పదవీ కాలం పూర్తయిన వారిలో ఎంత మందికి తిరిగి వారి పదవుల కాలాన్ని పొడిగించడం (రీ-అపాయింట్‌మెంట్), కొత్తగా ఎవరెవరికి ఛాన్స్ కల్పించాలన్న అంశంపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ మేరకు మీనాక్షి నటరాజన్‌తో ఇటీవల పిసిసి చీఫ్ సమావేశమై కసరత్తు చేశారు. అనంతరం వారు ముఖ్యమంత్రితో సమావేశమై చివరకు ఒక జాబితాను రూపొందించారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఆర్టీసీ, పర్యాటక శాఖ, డెయిరీ వంటి కొన్ని కీలకమైన కార్పొరేషన్లకు పోటీ అధికంగా ఉండడంతో మూడేసి పేర్లతో జాబితా రూపొందించారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి నియామకం




**హైదరాబాద్, జులై 26 (నిజాయితీ):**
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచన మేరకు, క్యాబినెట్ మంత్రి ప్రహ్లాద్ జోషికి ఆయన ప్రస్తుతం నిర్వహిస్తున్న బాధ్యతలతో పాటు విద్యాశాఖ బాధ్యతలను కూడా అప్పగించాలని భారత రాష్ట్రపతి ఆదేశించారు దేశవ్యాప్త నిరసనల నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనా చేయడంతో, శనివారం (జూలై 25, 2026) ప్రహ్లాద్ జోషి కొత్త కేంద్ర విద్యాశాఖ మంత్రిగా నియమితుల య్యారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచన మేరకు, క్యాబినెట్ మంత్రి ప్రహ్లాద్ జోషికి ఆయన ప్రస్తుతం నిర్వహిస్తున్న బాధ్యతలతో పాటు విద్యా శాఖ బాధ్యతలను కూడా అప్పగించాలని భారత రాష్ట్రపతి ఆదేశించినట్లు ఒక అధికారిక ప్రకటన తెలిపింది. జోషి ప్రస్తుతం వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజా పంపిణీ, అలాగే నూతన మరియు పునరుత్పాదక ఇంధన శాఖల బాధ్యతలను నిర్వహిస్తున్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 75లోని క్లాజ్ (2) ప్రకారం, ప్రధానమంత్రి సలహా మేరకు, కేంద్ర మంత్రి మండలి నుండి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ సమర్పించిన రాజీనామాను రాష్ట్రపతి తక్షణమే అమల్లోకి వచ్చేలా ఆమోదించారని ఆ ప్రకటన పేర్కొంది.

**మద్యం మత్తులో కన్నబిడ్డల ముందే**

# భార్యను నరికి చంపిన భర్త

**హైదరాబాద్, జులై 26 (నిజాయితీ):**
ఉత్తరప్రదేశ్‌లో దారుణం చోటుచేసుకుంది. మద్యానికి బానిసైన ఓ భర్త.. 8 నెలల గర్భిణీ అయిన భార్యను అత్యంత ఘోరంగా నరికి చంపేశాడు. కన్న బిడ్డల ముందే భార్యను కడతేర్చాడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మహోబా జిల్లాలో అత్యంత హృదయ విదారక ఘటన చోటుచే సుకుంది. మద్యం, జూదానికి బానిసైన ఓ కసాయి భర్త.. 8 నెలల గర్భిణీ అయిన తన భార్యను అత్యంత దారుణంగా చంపేశాడు. కన్నబిడ్డల ముందే కొడవలితో భార్యను నరికి చంపేశాడు. పన్వారీ పోలీసు స్టేషన్ పరిధిలోని బిగ్రారీ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బిగ్రారీ అనే గ్రామంలో హనిఫ్ మన్సూరి, మనిషా దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఐదేళ్ల కుమారుడు, రెండెళ్ల కుమార్తె ఉన్నారు. మన్సూరి మద్యానికి, జూదానికి బానిసగా మారి.. ఇప్పటికే తనకున్న భూమిలో చాలా వరకు అమ్మేశాడు. అంతేకాక మద్యం తాగేందుకు డబ్బుల కోసం తరచూ మనీషాను వేధిస్తుండే వాడు. శనివారం రాత్రి కూడా మద్యం తాగి పొద్దుపోయాక ఇంటికి వచ్చిన మన్సూరి.. అక్కడ కూడా మరింతంగా మద్యం సేవించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో మందు తాగొద్దని అతని భార్య మనీషా వారించింది. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఉన్మాదిగా మారిన మన్సూరి కొడవలి తీసుకుని, ఎనిమిది నెలల గర్భిణీ అని కూడా చూడకుండా ఆమెపై విచక్షణారహితంగా దాడి చేసి పొట్టనబెట్టుకున్నాడు. తల, కాళ్లుచేతులు ఇలా కొడవలితో నరకడం మనీషా అక్కడికక్కడే ప్రాణాలు వదిలేసింది. ఈ అఘాయిత్యం జరిగిన సమయంలో వారి పిల్లలు కూడా అక్కడే ఉన్నారు. నేరం నుంచి తప్పించుకునేందుకు మన్సూరి తానే స్వయంగా పోలీసులకు ఫోన్ చేసి ఒక కట్టుకథ అల్లాడు. అయితే, భయంతో వణికిపోతున్న ఐదేళ్ల పసిబాలుడు జరిగిన విషయాన్ని పోలీసులకు తెలపడంతో నిందితుడి బాగోతం బట్టబయలైంది. పన్వారీ ఎస్హెచ్ఓ ప్రవీణ్ కుమార్ నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు నిజం బయటపడింది. ఆగంతకుని తండ్రి, ఇంకా మృతురాలి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. తమ కుమారుడు మన్సూరిని గత నాలుగేళ్ల ముందే ఇంటినుండి వెలేశామని, కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు చెప్పగా, నిందితుడి తండ్రి సైతం తన కొడుకు చేసిన పాపానికి మరణశిక్ష విధించినా తప్పులేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసు కుంటున్నామని, దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.




TGTEL/25/A3750 ... నిజమే ...
నిజాయితీ
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక
నిజాలను నిర్భయంగా
ప్రజల ముందుకు తీసుకు వెళ్లే
తెలుగు దినపత్రికతో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని
జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను
వివరాలకు సంప్రదించండి
9441946907

# విద్యా రంగ పరిరక్షణ కోసం ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి -




**నాగర్‌కర్నూల్, జులై 26 (నిజాయితి):** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎస్.టి.యూ.భవన్ లో ఆదివారం నాడు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అత్యవసర కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కే.శ్రీధర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు రావలసిన 6 డి.ఏ.ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని పి.ఆర్.సి.ని తక్షణమే ప్రకటించాలని కోరారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పోకల సతీష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి గారు ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ ను రద్దు చేయాలని ఓపిఎస్‌ను అమలు పరచాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.రమేష్ మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణ కోసం ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధన రెండుదశాబ్దాలుగా ఉన్న సమస్యను పరిష్కరించి మండల విద్యాధికారి, డిప్యూటీ ఈవో, జూనియర్ లెక్చరర్ల పోస్టులకు పదోన్నతులు కల్పించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల హెల్త్ కార్డ్స్ జాప్యం లేకుండా వెంటనే ఇవ్వాలన్నారు. రాష్ట్ర కార్యదర్శులు అనిల్ కుమార్ రెడ్డి, ప్రభాకర్ మాట్లాడుతూ జిపిఎఫ్, మెడికల్ రీయంబర్స్మెంట్, సరెండర్ లీవ్ పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. రిటైర్ అయిన ఉపాధ్యాయులకు రావలసిన బెనిఫిట్స్ అన్ని ఇవ్వాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వి.సత్యనారాయణ, కరుణాకర్‌రెడ్డి, మల్లయ్య, మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాలస్వామి, సురేష్ బాబు, శ్రీనివాసచారి, వెంకటస్వామి, హనుమంతు, శేఖర్, నరసింహ, నారాయణ, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్‌లో

# ఇంటింటా ఎన్.సి.డి.ఆరోగ్య సర్వే

### ఆరోగ్య సర్వే లో ప్రతి ఇంటిని సందర్శించి వివరాల సేకరణ చేయాలి - డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి ఆకస్మిక తనిఖీ

**నాగర్‌కర్నూల్, జులై 26 (నిజాయితి):** నాగర్‌కర్నూల్ లోని పీపీ యూనిట్ వైద్యులు ఆరోగ్య సిబ్బంది ఆదివారం నాడు ప్రత్యేకంగా ఇంటింటా జాతీయ అసంక్రమిత వ్యాధుల (ఎన్.సి.డి.)ఆరోగ్య సర్వేను నిర్వహించారు.సర్వే ఆరోగ్య కార్యక్రమాన్ని నాగర్ కర్నూలు డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ.డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.పి.పి.యూనిట్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ,బీసీ కాలనీ,ఈశ్వర్ కాలనీ,రాఘవేంద్ర కాలనీ,ఎర్రగడ్డ,వినోభ నగర్ కాలనీ,శ్రీనగర్ కాలనీ,రహత్ నగర్ కాలనీ,టీచర్స్ కాలనీ, వడ్డేగేరి,సంజయ్ నగర్ కాలనీ,పాపయ్య నగర్ కాలనీ,మధుర నగర్ కాలనీ,క్రిస్టియన్ కాలనీ,బృందావన్ కాలనీ, శ్రీపురం రోడ్,నల్లవెల్లి రోడ్డు ప్రాంతంలోనీ ప్రతి ఇంటిని సందర్శించి 30 సంవత్సరాల పైబడి ఉన్న ప్రతి కుటుంబ సభ్యుని ఆరోగ్య వివరాలు సేకరించాలని ఆయన సూచించారు.ప్రభుత్వ ఆదేశం ప్రకారం బి.పి,షుగర్, టి.బి.పక్షవాతం,గర్భవతుల వివరాలు,అన్ని రకాల క్యాన్సర్ రోగుల వివరాలు,కుటుంబ నియంత్రణ వివరాలు



తప్పనిసరిగా సేకరించాలని ఆయన సూచించారు.ఆరోగ్య బృందం,ఆశా కార్యకర్తలు సేకరించిన ఆధార్ సంబంధిత వివరాలు ఆన్లైన్ ద్వారా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.ఎన్.సి.డి. సర్వేను ఈ నెలలో పూర్తి చేయాలని ప్రత్యేకంగా సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పి.పి.యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి. సృజన,హెల్త్ ఎడ్యుకేటర్ ఓరుగంటి శ్రీనివాసులు, సూపర్వైజర్ మరియమ్మ, మహిళా ఆరోగ్య కార్యకర్తలు నర్సింగమ్మ, కల్పన, సునీత,ఫార్మసీ ఆఫీసర్ అఖిల,ఆశా కార్యకర్తలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ఏఐటీయూసీ నాగర్‌కర్నూల్ జిల్లా 3వ మహాసభలు

# తాడూర్ మండల కేంద్రంలో భారీ ర్యాలీ, కార్మికుల గర్జన







**సభలో కింది డిమాండ్లతో చేసిన తీర్మానాలు :**

1. అన్ని రంగాల కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి
2. ఆన్ డ్యూటీ ప్రమాదాలకు పూర్తి వైద్య సదుపాయం, ఎక్స్‌గ్రేషియా అమలు చేయాలి
3. స్మార్ట్ మీటర్లు, టెండర్ విధానాలతో ఉపాధి కోల్పోతున్న కార్మికులను ఆదుకోవాలి
4. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

**నాగర్‌కర్నూల్, జులై 26 (నిజాయితి):** కార్మికుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఏఐటీయూసీ జిల్లా 3వ మహాసభలు ఆదివారం తాడూర్ మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన కార్మికులు ఎర్రజెండాలతో, నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించారు.

తాడూర్ ప్రధాన రహదారుల గుండా సాగిన ర్యాలీ సభా ప్రాంగణానికి చేరుకుంది. "లేబర్ కోడ్స్ రద్దు చేయాలి", "కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి", "కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి" అంటూ నినాదాలు మార్మోగాయి. అనంతరం మండల కేంద్రంలో ని ఫంక్షన్ హాల్ లో ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి పరుషరాములు,పి.కిరణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన మహాసభల్లో

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు యం.బాలనర్సింహ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.సంఘటిత అసంఘటిత కార్మికుల హక్కుల కోసం మరింత పటిష్టంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి యం.నర్సింహ మాట్లాడుతూ, వివిధ రంగాల కార్మికులు ఏఐటీయూసీ జెండా కింద ఏకం కావాలని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు, ఇన్సెంటీవ్లు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు సకాలంలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

తెలంగాణ మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని మున్సిపల్ కార్మికులకు 15 క్యాజువల్ 8 పండుగ సెలవులు అమలు చేయాలని అన్నారు. అనారోగ్యంతో మరణించిన కార్మికుని కుటుంబంలో మరియు 60 సంవత్సరాలు పైబడిన కార్మికుల స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి వారసత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేయడం జరిగింది. జనాభాకు అనుగుణంగా కార్మికులను పెంచాలన్నారు.

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ యం డి ఫయాజ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటంలో పాల్గొన్న ఏకైక సంఘం ఏఐటీయూసీ.అనినాటి నుండి నేటి వరకు కార్మిక దేశంలో కార్మిక వర్గం పక్షాన నిలబడి హక్కు ల కోసం అలుపెరుగని పోరాటలు నిర్వహిస్తున్న సంఘం ఏఐటీయూసీ అని మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ మహాసభలు కార్మికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని, రాబోయే ఉద్యమాలకు దిశానిర్దేశం చేశాయని నాయకులు తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి ఏఐటీయూసీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# లీకేజీ సమస్యను వెంటనే పరిష్కరించిన గుర్రంపోడు సర్పంచ్ జాల యాదయ్య



**గుర్రంపోడు, జులై 26 (నిజాయితి):** గుర్రంపోడు మండలంలోని 2వ వార్డులో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ ఏర్పడడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ జాల యాదయ్య వెంటనే స్పందించి సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి మరమ్మత్తు పనులు చేపట్టించారు.సర్పంచ్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పైప్‌లైన్ లీకేజీని సరిచేసే పనులను వేగంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు షేక్ అమీర్, షేక్ సయ్యద్, పోలేపల్లి రమేష్ పాల్గొని పనులను పర్యవేక్షించారు. తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా వెంటనే చర్యలు తీసుకున్న సర్పంచ్ జాల యాదయ్య, వార్డు సభ్యులు, మున్సిపాలిటీ సిబ్బందికి స్థానికులు అభినందనలు తెలిపారు.

# మానవత్వమే పరమార్థం

## బంజారాహిల్స్‌లో స్వచ్ఛందంగా అన్నదాన కార్యక్రమం



**హైదరాబాద్, జులై 26 (నిజాయితి):** బంజారా హిల్స్ లో ఉన్న బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వద్ద రెడీ టూ సర్వ్ ఫౌండేషన్, అమ్మ హెల్పింగ్ హాండ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి వద్ద చికిత్స కోసం వచ్చిన పేద రోగులు వారి కుటుంబ సభ్యులు, అవసరమైన వారికి సుమారు 300 మందికి ఉచితంగా భోజనం పంపిణీ చేశారు.

ఈ సేవా కార్యక్రమంలో పలువురు స్వచ్ఛందంగా వాలంటీర్లుగా పాల్గొని, స్వయంగా ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు వాలంటీర్లు స్వచ్ఛందంగా సేవలందిస్తూ వందలాది మందికి ఆహారం అందించారు. సమాజంలో ఆకలితో బాధపడుతున్న వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించనున్నట్లు వెల్లడించారు.

ఆస్పత్రుల వద్ద చికిత్స కోసం నిరీక్షించే పేద రోగులు, వారి కుటుంబ సభ్యులకు ఈ అన్నదానం ఎంతో ఉపయోగకరంగా మారిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు.

ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు పెద్ది శంకర్ మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలనుకునే దాతలు, స్వచ్ఛంద సేవకులు తమను సంప్రదించాలని కోరారు. సమాజ సేవలో మరింత మంది భాగస్వాములు కావడం ద్వారా అవసరమైన వారికి మరింత విస్తృతంగా సహాయం అందించగలమని ఆయన పేర్కొన్నారు.

# 20 కోట్లతో నాలాల నిర్మాణం, కాప్రాయి చెరువు అభివృద్ధి

### - మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్



**ఎల్బీనగర్, జులై 26 (నిజాయితి):** సాహెబ్ నగర్ కాప్రాయి చెరువు పరిధిలోని కాలనీలకు ముంపు సమస్య లేకుండా సుమారు రూ 20 కోట్ల వ్యయంతో నాలాల నిర్మాణం అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఆయన సాహెబ్ నగర్, బి.యన్.రెడ్డి డివిజన్లలో విస్తృతంగా పర్యటించి స్థానిక కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కాప్రాయి చెరువు కట్టపై ఉన్న అస్తవ్యస్త పరిస్థితిని ఆయన స్వయంగా పరిశీలించారు. కొందరు ఆకతాయిలు, తాగుబోతులు రాత్రివేళల్లో చెరువు కట్టపై తిరుగుతూ ఇబ్బందులు కలిగిస్తున్నారని, అక్కడ మద్యం డ్రగ్స్ సేవిస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారని పరిసర కాలనీల నివాసితులు మధుయాష్కి గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. చెరువు కట్టను సుందరీకరించాలని చీకటిగా ఉన్న ప్రాంతాల్లో వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

**అధికారుల ఉరుకులు పరుగులు**

కాలనీవాసుల ఫిర్యాదులపై మధుయాష్కి గౌడ్ తక్షణమే స్పందించారు. వెంటనే పోలీస్ అధికారులను అక్కడికి పిలిపించి చెరువుకట్టపై మందుబాబులు, ఆకతాయిలు సంచరించకుండా కఠిన నిఘా ఉంచాలని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా జలమండలి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. చెరువు కట్ట సుందరీకరణ వీధి దీపాల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. డ్రైనేజీ నీరు చెరువులో కలవకుండా ప్రత్యేక పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టి కాలనీల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కోరారు.

# ఇంద్రనగర్ డ్రైనేజీ సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు





**మద్నూర్, జులై 26 (నిజాయితి) :** కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని ఇంద్రనగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సమస్యలను వివరించిన సర్పంచ్ ఇంద్రనగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిశీలించేందుకు స్థానిక ఎమ్మెల్యే ఉష సంతోష్ మేస్త్రి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎమ్మెల్యేకు డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిన్న పరిస్థితిని వివరించారు. వర్షాకాలంలో డ్రైనేజీ నీరు నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దుర్వాసనతో పాటు దోమల సమస్య కూడా పెరిగిందని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి సమస్య ఉన్న ప్రాంతాలను ఎమ్మెల్యేకు చూపించారు. డ్రైనేజీ కాలువలు మూసుకుపోవడం, మురుగునీరు సక్రమంగా వెళ్లకపోవడం వల్ల కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ వివరించారు. అనంతరం మద్నూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ప్రజలు మెరుగైన మౌలిక సదుపాయాలు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ సర్పంచ్ ఉషా సంతోష్ మేస్త్రి, సలాబత్పూర్ హన్మాన్ మందిర్ చైర్మన్ రామ్ పటేల్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేశ్ పటేల్,సీనియర్ నాయకులు సిహెచ్ హన్మండ్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

# మలిదశ ఉద్యమకారుడు మాణిక్ బాబుకి ఘననివాళి

**అచ్చంపేట, జులై 26 (నిజాయితి) :** ఈరోజు మలిదశ ఉద్యమకారుడు మాణిక్ బాబుకి నివాళు లర్పించిన అచ్చంపేట మలిదశ ఉద్యమకారులు TJAC. అచ్చంపేట ప్రతి ఉద్యమకారుడు తోచిన సహాయాన్ని అందించి ఆ కుటుంబానికి అండగా నిలిచిన అచ్చంపేట జేఏసీ. ఈ కార్యక్రమంలో పాల్గొన్నరూ చైర్మన్ కాశన్న యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో ప్రతిరోజు మాతో పాటుగా ఉద్యమంలో పాల్గొంటూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలి అని చెప్పి దృఢ సంకల్పంతోటి ప్రతిరోజు ఉద్యమంలో పాల్గొన్న ఘనత మాణిక్ బాబు గారిది అదేవిధంగా అచ్చంపేట నడిబొడ్డులో అమరవీరుల స్తూపం ఏర్పాటు చేయాలని ఎంతో సంకల్పంతోటి పట్టుబట్టి అచ్చంపేట నడిబొడ్డున అమరవీరుల స్థూపం ఉండాలి అమరులను అనునిత్యం నివాళు లర్పించడం మన బాధ్యత అని చెప్పి అచ్చంపేట నడిబొడ్డున అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటుకు అతని కృషి ఎంతో ఉన్నది అలాంటి మంచి మనసున్న గొప్ప నాయకుడు మాణిక్ బాబు గారు మా మధ్యన లేకపోవడం ఎంతో బాధాకరం అతని మరణం మేము జీర్ణించుకోలేకపోతున్నాము ఆ కుటుంబానికి ఆ దేవుడు ఆశీస్సులు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము ఆ అమరునికి ఈరోజు అచ్చంపేట జేఏసీ తన స్వగ్రామమైన బోధలకు వెళ్లి మాణిక్ బాబు బాబు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగినది ఈ కార్యక్రమంలో అచ్చంపేట జేఏసీ చైర్మన్ కాశన్న యాదవ్ మరియుఉల్పర శ్రీరామ్ మాజీ సర్పంచ్ ఎల్లి కంటి శ్రీనివాసులు కుంద మల్లికార్జున్ విజయ మోహన్ పాండు జక్కా



గోపాల్ నల్లమల్ల యాదయ్య రాష్ట్ర జేఏసీ నాయకులు శ్రీను, మీడియా ఇంచార్జ్ మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## జూలై 30న జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో

# గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలి.

## జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



**నాగర్‌కర్నూల్, జులై 26 (నిజాయితి) :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం కారణంగా నాగర్ కర్నూల్ జిల్లాలోనూ వర్షపాతం తగ్గిన నేపథ్యంలో గ్రామీణ ప్రజలు, రైతులను అప్రమత్తం చేయడంతో పాటు ముందస్తు చర్యలపై విస్తృత అవగాహన కల్పించేందుకు జూలై 30న జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి అధికారులకు, మండల స్థాయి అధికారులకు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్పష్టమైన సూచనలు జారీ చేశారు.

ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, ఇప్పటికే చెరువులు, రిజర్వాయర్లు, భూగర్భ జలాల నీటిమట్టాలు తగ్గుముఖం పట్టే పరిస్థితులు నెలకొనే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే వ్యవసాయం, పశుసంవర్ధక రంగం, గ్రామీణ ప్రజల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికలు రూపొందించి వాటిని సమర్థవంతంగా అమలు చేయడం అత్యంత అవసరమని తెలిపారు.

ఈ నేపథ్యంలో నిర్వహించే గ్రామసభల్లో రైతులు, గ్రామస్థులకు ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల ఏర్పడే పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

గ్రామసభల్లో ముఖ్యంగా వ్యవసాయ పంటలకు సంబంధించి ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక (కాంటింజెన్సీ ప్లాన్), తాగునీటి నిర్వహణ, నీటి సంరక్షణ చర్యలు, వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణం, సామూహిక ఇంకుడు గుంతల ఏర్పాటు, వ్యవసాయ క్షేత్రాల్లో ఫార్మ్ పాండ్ల నిర్మాణం, పర్కొలేషన్ ట్యాంకుల ఏర్పాటు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు, వర్షపు నీటి సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించి ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు.

జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో జూలై 30న గ్రామసభలను తప్పనిసరిగా నిర్వహించి, రైతులు, మహిళా సంఘాలు, యువత, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

అలాగే మండల పంచాయతీ అధికారులు (ఎంపీవోలు), మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు), డివిజనల్ పంచాయతీ అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు గ్రామసభల నిర్వహణను ప్రత్యక్షంగా పర్యవేక్షించి, ఎక్కడా నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

గ్రామసభలు విజయవంతంగా నిర్వహించిన అనంతరం సంబంధిత వివరాలతో కూడిన సమగ్ర నివేదికలను జిల్లా పంచాయతీ కార్యాలయానికి వెంటనే పంపించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

## కన్నెపల్లిలో భక్తిశ్రద్ధలతో గ్రామదేవత

# బోనాల ఉత్సవం



**కొమరంభీమ్/ఆసిఫాబాద్, జులై 26 (నిజాయితి) :** కొమరం బీమ్ ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని కన్నెపల్లి గ్రామంలో గ్రామదేవతలకు నిర్వహించిన బోనాల ఉత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో అలంకరించుకుని, తలపై బోనాలు మోసుకుంటూ గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, భక్తి గీతాల మధ్య సాగిన బోనాల ఊరేగింపు గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది. గ్రామస్తులు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని గ్రామ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో మహిళలు, యువకులు, చిన్నారులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలోతదితరులు పాల్గొని భక్తిని చాటుకున్నారు

## బెజ్జూర్ మండల కేంద్రంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులు

# ప్రజలకు తీవ్ర ఇబ్బందులు



**కొమరంభీమ్/ఆసిఫాబాద్, జులై 26 (నిజాయితి) :** కొమరం బీమ్ ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండల కేంద్రంలో యజమానులు పశువులను రోడ్లపై విచ్చలవిడిగా వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారులు, కూడళ్లు, మార్కెట్ ప్రాంతాల్లో పశువులు గుంపులుగా సంచరిస్తుండటంతో తరచూ ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి.

ముఖ్యంగా వారాంతపు సంత సమయంలో పశువులు దుకాణాల వద్దకు చేరుకుని వినియోగదారుల వస్తువులు, కూరగాయలు, ఇతర సామాగ్రిని ధ్వంసం చేస్తున్నాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, ఇతర ప్రయాణికులు పశువుల కారణంగా ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

ఈ సమస్యపై గ్రామపంచాయతీ అధికారులకు, సంబంధిత శాఖలకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి శాశ్వత చర్యలు తీసుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారులు, సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి రోడ్లపై సంచరిస్తున్న పశువులను నియంత్రించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# నేడు గీసుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టెలికాం వినియోగదారుల అవగాహన సదస్సు

## -ట్రాయ్ కాగ్ సభ్యురాలు కల్లకు శోభారాణి.

**వరంగల్ జిల్లా, జులై 26 (నిజాయితి) :** టెలికాం వినియోగదారుల హక్కుల పరిరక్షణ, సేవల నాణ్యత పెంపే లక్ష్యంగా భారత టెలికాం సంస్థ ఆధ్వర్యంలో నేడు గీసుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ట్రాయ్ కాగ్ తెలంగాణ రాష్ట్ర సభ్యురాలు కల్లకు శోభారాణి తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక పత్రికా ప్రకటనను విడుదల చేస్తూ వివరాలను వెల్లడించారు. నేడు మధ్యాహ్నం 1:30 గంటలకు గీసుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ సదస్సు జరుగుతుంది. వినియోగదారులు తమ మొబైల్, ఇంటర్నెట్ నెట్‌వర్క్ సంబంధిత సమస్యలు మరియు సందేహాలను నేరుగా అధికారులతో చర్చించి నివృత్తి చేసుకోవచ్చు. టెలికాం సంస్థల ప్రతినిధుల భాగస్వామ్యం: ప్రభుత్వ రంగ సంస్థ బి.ఎస్.ఎన్.ఎల్ తో పాటు ఎయిర్‌టెల్, వొడాఫోన్-ఐడియా, రిలయన్స్ జియో వంటి ప్రముఖ టెలికాం సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. నెట్‌వర్క్ సమస్యలు, రీఛార్జ్




సంబంధిత సమస్యలు ఎదురైనప్పుడు ఎవరికి మరియు ఏ విధంగా ఫిర్యాదు చేయాలనే విషయాలపై వినియోగదారులకు స్పష్టమైన అవగాహన కల్పిస్తారు. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటంలో ట్రాయ్ కీలక పాత్ర పోషిస్తుందని శోభారాణి పేర్కొన్నారు. కావున ఈ సదావకాశాన్ని గీసుకొండ వినియోగదారులు, విద్యార్థులు, హాజరై సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని

## కోనాపురంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

**చెన్నారావుపేట, జులై 26 (నిజాయితి) :** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు పెద్ది సుదర్శన్ రెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో, పూర్తి తేజస్సుతో తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ కోనాపురం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బిఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో గుడి ప్రాంగణంలో ఆలయ అర్చకులు శ్రీకృష్ణచార్యులు శాస్త్రోక్తంగా అర్చనలు, ప్రత్యేక పూజలు జరిపారు. నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల శ్రేయస్సుకు అహర్నిశలు శ్రమించిన నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అని, ఆయన వీలైనంత త్వరగా సాధారణ జీవితంలోకి వచ్చి, ప్రజలకు మళ్లీ అందుబాటులోకి రావాలని భగవంతుడిని వేడుకున్నట్లు నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బానాపురం రాజేందర్, ఇందూరి నర్సిరెడ్డి, ఎడ్ల నారాయణరెడ్డి, జన్ను దేవేందర్, కౌడగాని రాజీరు, పున్నం నరసయ్య, అనుమాండ్ల మల్లేశం, ఈర చంద్రయ్య, లడె రవ్యా, కల్లేపు రమేష్, కాటి రాజు, యువ నాయకులు పరికి అనిల్, ఈర రాజ్ కుమార్, పున్నం రవికుమార్, నీరటి నాగరాజు, లక్క హరిష్, వైనాల శివ, జంగిలి రవికుమార్, లక్క అంజి, బండి తరుణ్, కల్లేపు ప్రణీత్ పాల్గొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై శుభవార్త వినాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ఆయనకు లభిస్తున్న ప్రజాదరణకు, నాయకులు ఆయనపై చూపిస్తున్న అభిమానానికి ఈ ప్రత్యేక పూజా కార్యక్రమమే నిదర్శనమని వారు పేర్కొన్నారు.



# ఉద్యమ కారులసేవలకు గుర్తింపు కల్పించాలి

## ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు వినతి పత్రం అందజేత




**కొమరంబీమ్/ఆసిఫాబాద్, జులై 26 (నిజాయితి):** కొమరంబీమ్ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంఉమ్మడి బెజ్జుర్, (కౌటాల) చింతలమనేల్లి మండలంలోని ఉద్యమకారులు తెలంగాణ ఉద్యమంలో తాము నిర్వహించిన కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకుని ఉద్యమకారులుగా గుర్తింపు కల్పించాలని, ఎమ్మెల్సీ, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం కి వినతిపత్రం అందజేశారు.. ఈ సందర్భంగా పలు మండలాలనీ జమైన ఉద్యమకారులు,పుల్గం నారాయణ, డాక్టర్ లహన్ రాజ్, జావీద్, రమేష్ జగదీష్ తివారి. మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తాము విశేషంగా కృషి చేశామని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, అప్పటి టీఆర్ఎస్ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య సమక్షంలో, ఆధ్వర్యంలోబెజ్జుర్, నుండి నియోజకవర్గం లో గ్రామంఅన్ని నుంచి కాగజ్‌నగర్ వరకు సుమారు 65.కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించామని తెలిపారు. అలాగే ఉమ్మడి బెజ్జూరు మండల పరిధిలో "పల్లె నిద్ర" కార్యక్రమాలు నిర్వహించడం, కాగడాల ప్రదర్శనల ద్వారా ఉద్యమ చైతన్యాన్ని ప్రజల్లో రగిలించడం, రైలు రోకో, బైండొవర్లు, అరెస్టులు, జైలు కేసులు,బంద్,సభలు, సమావేశాలు, సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్ వంట వార్పు , మానవహారం,సహా పలు ఉద్యమ కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ వంతు సేవలు అందించామని వివరించారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారుల పాత్ర అత్యంత కీలకమని, గ్రామీణ ప్రాంతాలలో పార్టీ బలోపేతం, సభత్వం,తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లామని తెలిపారు. అందువల్ల తమ ఉద్యమ సేవలను, సంబంధిత ఆధారాలను పరిశీలించినియోజకవర్గం లోని ఉద్యమకారుల బృందంలోని అర్హులైన సభ్యులకు తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తింపు కల్పించి న్యాయం చేయాలని ప్రొఫెసర్ కోదండరాం కు వినతిపత్రం ద్వారా కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజమైన ఉద్యమకారులు ఉమ్మడి బెజ్జుర్, కుమ్మరిలింగయ్య, ఉమ్మెరా లింగయ్య, జిర్నల్ ఖాన్ సెమీ, జావీద్, సుమిత్ర బాయి, ఎర్రయ్య, ఓ సిఖాన్, పురుషోత్తం,, (కౌటాల, ), చింతల మానేపల్లి,పెంచికల్పేట్ పేట్, సిర్పూర్, కాగజ్ నగర్ మండలాల ఉద్యమ కారులు తదితరులు పాల్గొన్నారు.

### కమిషనర్ కార్యాలయం నుండి అధికారికంగా ఉత్తర్వులు జారీ -

# విధుల్లో అలసత్వాన్ని సహించేది లేదని హెచ్చరిక

**హైదరాబాద్, జులై 26 (నిజాయితి):** విధి నిర్వహణలో నిర్లక్ష్యం అలసత్వం వహించినందుకుగాను మలక్‌పేట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎస్హెచ్ఓ కె. నరసింహను సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కమిషనర్ కార్యాలయం నుండి అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పూర్తి వివరాల్లోకి వెళ్తే

ఇన్‌స్పెక్టర్ నరసింహ ప్రస్తుతం మలక్‌పేట్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్హెచ్ఓ గా బాధ్యతలు స్వీకరించడానికి ముందు సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఆ సమయంలో ఆయన విధి నిర్వహణలో తీవ్ర అలసత్వం వహించారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఉన్నతాధికారులు లోతైన దర్యాప్తు చేపట్టారు. ఆ దర్యాప్తులో ఆయన నిర్లక్ష్యం వహించినట్లు రుజువు కావడంతో ఉన్నతాధికారులు నివేదికను సిద్ధం చేసి నగర పోలీస్ కమిషనర్‌కు సమర్పించారు. ఈ విచారణ నివేదిక ఆధారంగా క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఇన్‌స్పెక్టర్ నరసింహపై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు నగర కొత్వాల్ కమిషనర్ ప్రకటించారు.



# డాక్టర్ హేమా నాయక్ అధ్యక్షతన బి.ఎల్. ఏ.2 ల సమావేశం...

**పార్వతీపురం, జులై 26 (నిజాయితి):** పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాస్ పార్వతిపురం మన్యం జిల్లా ఇంచార్జ్ పొలిమేర శ్రీనివాసులు జిల్లా సెక్రెటరీ జి. బానోజీరావు, జిల్లా జిల్లా ట్రెజరర్ విశేష రావు జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు రెడ్ సింహాచలం ఎస్సీ మోర్చా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సాలూరు నియోజకవర్గ ఐదు మండలాల అధ్యక్షులు బిఎల్ఏ-2 సమావేశం లో పాల్గొన్నారు. సాలూరు పట్టణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఇంకా ఇన్చార్జి మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో బి ఎల్ ఎ 2 ఏ విధంగా ఏ విధంగా ఓటర్లను ఆకర్షించాలో, పార్టీని బలోపేతం చేయడం, పలు విషయాలు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలో ఉన్న బి. ఎల్. ఎ 2లతో సమావేశం సాలూరు మెంటాడ వీధి కళ్యాణ మండపం ఆదివారం ఉదయం జరిగింది. అదేవిధంగా కొన్ని గిరిజనుల కుటుంబాలు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి బిఎల్ఏ -1 గా ఉన్న డాక్టర్ హేమానాయ క్ అధ్యక్షతన జరిగినది. ఈ సభను ఉద్దేశించి డాక్టర్ హేమానాయక్ ప్రతి కార్యకర్త మనోభావాలు, భారతీయ జనతా పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించి వారిని పార్టీ మీద ఆసక్తి కల్పించడం జరిగింది.

# పోలీస్ ఉద్యోగాల భర్తీ, వయోపరిమితి పెంపుపై దిల్ సుఖ్ నగర్ లో నిరసన ప్రదర్శన

**హైదరారబాద్, జులై 26 (నిజాయితి):** తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ వేదికగా నిరుద్యోగులు శనివారం ఒక భారీ మహా ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో వందలాది మంది నిరుద్యోగ యువతీ యువకులు, ఉద్యోగార్థులు పాల్గొన్నారు.

ముఖ్యంగా పోలీస్ శాఖలో ఎస్ఐ కానిస్టేబుల్ పిసి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను తక్షణమే నోటిఫికేషన్ ఇచ్చి పూర్తి చేయాలని, అలాగే వయోపరిమితిని పెంచాలని నిరసనకారులు ప్లకార్డులతో నినాదాలు చేశారు. ముఖ్య అతిథిగా రాజ్యసభ ఎంపీ టైగర్ ఆర్. కృష్ణన్న

ఈ మహా ర్యాలీకి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు టైగర్ ఆర్. కృష్ణయ్య హాజరై నిరుద్యోగుల పోరాటానికి తన పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, ఖాళీగా ఉన్న వేలాది ఉద్యోగాలకు తక్షణమే మెగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.




# 13 వేల మంది బాలికలతో థింసా నృత్యం..

**పార్వతీపురం/మన్యంజిల్లా, జులై 26 (నిజాయితి):** భోగాపురంలో ఆగస్టు 1న జరగనున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా 13 వేల మంది గిరిజన బాలికలతో "థింసా నృత్యం" స్థల పరిశీలన, నిర్వహణ ఏర్పాట్లను మంత్రి సంధ్యారాణి పరిశీలించారు. బాలికల రక్షణ భద్రత ముఖ్యం అని చెప్పిడ సభా వేదిక, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.



Editor Boddupally Mallaiah 3-62, Yendabetla, Nagarkurnool, Telangana - 509209, Publisher, Owner And Printer, Gundur Shyam ,
Shyam Agencies Telkapally(M), Telangana 509385. Published 2-48/1 Near Hanuman Temple, Telkapally(M) Dist.Nagarkurnool, Telangana 509385.
Email : nijamenijayithi@gmail.com Website : nijamenijayithi.com Ph 9441946907